క్లుప్తంగా

వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడుని వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామికి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహన్యాస పూర్వక పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, కల్యాణ మహోత్సవం, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు జరిగాయి. పలువురు దంపతులు స్వామి కల్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం స్వామికి గ్రామోత్సవం చేశారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నాదెండ్ల: ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఇక్కడ పరీక్షలు జరుగుతాయని, రెండో సంవత్సరం విద్యార్థులకు చిలకలూరిపేటలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా సత్తెనపల్లి ప్రభుత్వ కళాశాల లైబ్రేరియన్ శ్రీలక్ష్మి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

కౌంటింగ్ ప్రక్రియకు పార్టీలు సహకరించాలి

ఆర్వో సుబ్బారావు



వినుకొండ(నూజెండ్ల): కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి వరదా సుబ్బారావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులు, చీఫ్ ఏజెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ జూన్ 4వ తేదీ కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఉప ఖజానా కార్యాలయాన్ని సందర్శించి బాక్స్‌లు పరిశీలించారు.

రావులాపురంలో వైద్యశిబిరం



బొల్లాపల్లి: మండలంలోని రావులాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్యసేవలందించారు. వైద్య బృందం ఇంటింటికి తిరిగి రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శంకరనారాయణ సేవలందించారు. మందులు పంపిణీచేశారు.

ఎండుగుంపాలెంలో కార్డన్ సెర్చ్

నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో జె.బలరామ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కావూరులో...



చిలకలూరిపేట టౌన్: మండలంలోని కావూరు గ్రామంలో పోలీసులు ఆకస్మికంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు వివిధ బృందాలుగా ఏర్పడి గ్రామంలోని కాలనీలోని అన్ని ఇళ్లను సోదాలు నిర్వహించారు. పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్ కుమార్, రూరల్ ఎస్ఐలు హరికృష్ణ, బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే దిశగా ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరంలో పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సముపార్జనతో పాటు మానసిక అభివృద్ధి పొందేలా కార్యక్రమాలను రూపొందించారు. ప్రతిరోజు కథలు వినటం, చిన్న చిన్న వినోదపు ఆటలు, పుస్తక సమీక్ష, పుస్తక పఠనం, కథలు చెప్పటంతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, డాన్స్ తదితర కార్యక్రమాలలో శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులలో సృజనాత్మకత పెరిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ తెలిపారు. శిబిరం ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. జూన్ 7వ తేదీ వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహించాలని పాఠశాలల ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

నాదెండ్ల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనంతో ఉత్తమ జ్ఞానం సముపార్జించుకోవచ్చని నాదెండ్ల శాఖా గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను పురస్కరించుకుని బుధవారం చిన్నారులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనానికి కొంత సమయాన్ని వెచ్చించి జ్ఞానవంతులుగా రూపొందాలని సూచించారు. ప్రతిరోజూ విద్యార్థులకు రాయటం, చదవటం, చదివించటం, గణితం, తెలుగు, ఇంగ్లిష్ తదితర అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు.

మహంకాళి అమ్మవారికి లక్ష మల్లెలతో అర్చన



పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు



పుష్పార్చన చేస్తున్న అర్చకస్వామి

నరసరావుపేట రూరల్: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారికి లక్షమల్లెలతో పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అమ్మవారికి జరిపిన కుంకుమార్చన, పంచ హారతి సేవల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకస్వాములు, రుత్వికులు వైభవంగా పుష్పార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దేవదాయ భూముల కౌలుకు వేలం

అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం, చింతపల్లి గ్రామాలలో గల కోదండరామస్వామి, రామలింగేశ్వరస్వామి దేవాలయాలకు చెందిన భూముల మూడు సంవత్సరాల కౌలుకు బహిరంగ వేలం బుధవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో నిర్వహించారు. పుట్లగూడెంలోని కోదండరామస్వామి ఆలయానికి చెందిన 10.49 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన కంబాల శ్రీనాథరావు రూ.1.18 లక్షలకు పాడుకున్నారు. గతంలో ఈ భూమి కౌలు మూడు సంవత్సరాలకు రూ.88,500 ఉండేది. అంటే గతంలో కన్నా రూ.29,500 అదనంగా దేవదాయ శాఖకు ఆదాయం వచ్చినట్లు ఆ శాఖ కార్యనిర్వ హణాధికారి కోటిరెడ్డి తెలిపారు. చింతపల్లిలోని రామలింగేశ్వరస్వామి వారి దేవాలయానికి చెందిన 14.72 ఎకరాల భూమిని ఇదే గ్రామానికి చెందిన బత్తుల నాగేశ్వరరావు, బత్తుల గోపాలకృష్ణ సంయుక్తంగా రూ.1.23 లక్షలకు పాడుకున్నారు. గతంలో ఈ భూమి కౌలు రూ.1.06 లక్షలు ఉండేది అంటే గతంలో కన్నా రూ.17 వేలు పెరిగింది. కార్యక్రమంలో దేవదాయ శాఖాధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మురళీకృష్ణ

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న నరసరావుపేట జేఎన్‌టీయూకేలో జరగనున్న నేపథ్యంలో బుధవారం సత్తెనపల్లి ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూకే, నరసరావుపేట స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను నియోజకవర్గ అభ్యర్థులు, ఏజెంట్లు, వారి ప్రతినిధులు ఎవరైనా కానీ 24 గంటలు కౌంటింగ్ రోజు వరకు లైవ్ ఫుటేజీను చూసుకునేందుకు అనుమతి ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ బాక్సులు కౌంటింగ్ ముందు రోజు జూన్ 3న సాయంత్రం 4 గంటలకు కౌంటింగ్ సెంటర్‌కు తరలించబడతాయన్నారు. కౌంటింగ్ రోజు జూన్ 4న ఉదయం 7.59 గంటల వరకు వచ్చిన సర్వీసు ఓటర్ల పోస్టల్ బ్యాలెట్‌లు కౌంటింగ్‌లో పరిగణనలోకి తీసుకోబడతాయన్నారు. ఈ సందర్భంగా కౌంటింగ్ రోజు నిర్వహించవలసిన విధి విధానాలను వివరించారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు సీహెచ్ ఉష, ఎల్.లక్ష్మీనారాయణ, పి.లక్ష్మీనరసింహం, కొలిమి షమ్మి, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, పాల్గొన్నారు.

వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకోవాలి

ఎంపీడీవో బి.వెంకటరెడ్డి



పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడివో వెంకటరెడ్డి

బెల్లంకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరూ వంద పని దినాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో బి.వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బెల్లంకొండ, కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పని జరుగుతున్న చోట ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతీ కూలీకి శ్రమకు తగిన వేతనం వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కందకాలు, కాలువలు, కుంటలలో పనులు చేపట్టి వర్షపు నీరు నిల్వ ఉండేలా పనులు చేయించాలని తెలిపారు. ఆయన వెంట ఏపీవో కోటమ్మ, టీఏ చిరంజీవి నాయక్ తదితరులు ఉన్నారు.

కొత్తపాలెంలో పోలీసుల తనిఖీలు



మాచవరం: పోలింగ్ అనంతరం గ్రామాల్లో చోటు చేసుకున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కొత్తపాలెం గ్రామంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు. పోలీసుల తనిఖీల్లో అనుమానిత ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సరైన ఆధార పత్రాలు కలిగిన ద్విచక్ర వాహనాలను యజమానులకు అప్పగించగా, మరో 5 వాహనాలకు సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలియజేశారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



గురజాల: నగర పంచాయతీలోని జంగమహేశ్వర పురంలో వేంచేసియున్న లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిసాయి. బుధ వారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, అభ్రుత స్నానం మహాభిషేకం పూర్ణాహుతితో పాటు ద్వాదశ ప్రదక్షిణలతో ఉత్సవాలు ముగిసాయి.

సాయంత్రం సమయంలో స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు బుద్ధ జయంతి పోటీలు

నరసరావుపేట ఈస్ట్: గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకొని శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24వతేదీ శుక్రవారం ప్రకాష్ నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి బుధవారం తెలిపారు. పాఠశాల స్థాయిలో 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. గౌతమ బుద్ధుడు-ధర్మము, ఆంధ్రదేశంలో ప్రముఖ బౌద్ధ స్థావరాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై బౌద్ధమత ప్రభావం, భారత రాజ్యాంగంలో బౌద్ధమత చిహ్నాలు, వాటి వివరాలు అంశాలపై పోటీ ఉంటుందన్నారు. విద్యార్థులు వీటిలో ఏదో ఒకటి ఎంచుకొని మాట్లాడవచ్చని తెలిపారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం

నాదెండ్ల: మతిస్థిమితం లేని 62 ఏళ్ల వృద్ధుడు తప్పిపోయిన ఘటన మంగళవారం గణపవరంలో చోటుచేసుకుంది. ఆయన కుమార్తె ఆలా శ్రీలక్ష్మి గణపవరం నాలుగో సచివాలయంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తున్నది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం, వేములపాడు గ్రామంలో నివాసం ఉండే తన తండ్రి ముప్పరాజు లక్ష్మీనారాయణ(62) ఈ నెల 19న గణపవరంలోని కుమార్తె శ్రీలక్ష్మి నివాసానికి వచ్చాడు. అదేరోజు సాయంత్రం 5 గంటల సమయంలో టీ తాగేందుకు బజారుకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. బంధువులకు సమాచారమిచ్చినా ఫలితం లేదు. దీంతో నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది.

వివాదాస్పద గ్రామాలపై పోలీస్ నిఘా

నకరికల్లు: ఎన్నికల తరువాత జరిగిన అల్లర్ల నేపథ్యంలో వివాదాస్పదంగా ఉన్న గ్రామాలపై పోలీస్ నిఘా ఉందని ఎస్ఐ పి.రాంబాబు బుధవారం తెలిపారు. గుండ్లపల్లి, చీమలమర్రి, కుంకలగుంట గ్రామాల్లో ఈవీఎంలు ధ్వంసం చేసిన ఘటనపై విచారణ కొనసాగుతుందని అన్నారు. ఘర్షణల్లో పాల్గొన్న వారి వివరాలు సేకరించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానిత ప్రాంతాల్లో పేలు డు పదార్థాలు, మారణాయుధాలు గుర్తించేందుకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఘర్షణలు చోటుచేసుకున్న గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో పికెటింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు. అనుమానిత వ్యక్తులను బైండోవర్ చేయడంతో పాటు ఘర్షణల్లో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ సెంటర్లలోని అన్నార్తులకు అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో దాత గొట్టం వెంకటేష్, లక్ష్మీ మౌనిక వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా టైలర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యుడు షేక్ క్యాలిబర్ జానీ మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సామాజిక సేవా సంస్థ అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ అని కొనియాడారు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించి అందరి అభిమానాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ కె.దస్తగిరి, సభ్యులు చావల వెంకటేశ్వర్లు, పిక్కిలి రత్తయ్య, సైదారావు, పి.శివ ఉన్నారు.

పోలేరమ్మతల్లి వార్షిక ఉత్సవాలు ప్రారంభం



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో పోలేరమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉదయం గ్రామస్తులు ఊరేగింపుగా జలశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు పొంగళ్లు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. 23వ తేదీ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

వైభవంగా నృసింహ స్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధా గోవిందులు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నారసింహ ఉత్సవమూర్తులు




శ్రీలక్ష్మీనరసింహ స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో బుధవారం శ్రీనృసింహ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం శ్రీరాధా గోవిందుల మూలమూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. అలాగే శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం రాజభోగ హారతి, సాయంత్రం వైకాళిక హారతి, తులసీ హారతి సమర్పించి 54 రకముల ద్రవ్యాలతో మహా శంఖాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా హేమ హరిప్రభు శ్రీ నారసింహ భగవానుని లీలలుపై ప్రవచనం చేశారు. రాత్రి 108 రకాల మధుర భక్ష్యాలతో భోగా నివేదన సమర్పించారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నరసింహస్వామి జయంతి ఉత్సవాలు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లిలోని స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో నరసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. మామిడి పండ్లతో స్వామి వారికి సహస్రనామార్చన పూజలు చేశారు. శాంతి కళ్యాణ మహోత్సవం చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు చతుర్వేద భరత్‌కుమార్ నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

మల్లాదిలో హనుమజ్జయంతి ఉత్సవాలు



విశేషాలంకారంలో స్వామివారు



మల్లాదిలో నలభై అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

అమరావతి: మండల పరిధిలోని మల్లాది ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 31, జూన్ 1న రెండు రోజుల పాటు హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భవిరిశెట్టి హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకుడు పరుచూరి వెంకటరమణాచార్యులు యాజ్ఞిక నిర్వహణలో హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా 31వ తేదీ ఉదయం 40 అడుగుల అభయాంజనేయస్వామి వారికి విష్వక్సేనారాధన అనంతరం పంచామృత స్నపన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. జూన్ 1వ తేదీ ధ్యానాంజనేయ స్వామి వారికి పంచామృత స్నపన, సహస్రనామాలతో తమలాపాకులతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు.

అమరావతిలో...

పుణ్యక్షేత్రమైన అమరావతిలో హనుమత్ జయంతి సందర్భంగా పవిత్ర కృష్ణానది తీరాన అభయాంజనేయస్వామి ఆలయంలో, మెయిన్‌రోడ్‌లోని కోదండ రామాలయంలోని అభయాంజనేయునికి ప్రత్యేక పూజలతో పాటు వాసవీ మహిళా మండలి సభ్యులచే 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు పరాశరం రామకృష్ణమాచార్యులు తెలిపారు.

కార్మికోద్యమాలకే సత్యనారాయణ జీవితం అంకితం



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్

సత్తెనపల్లి: కార్మిక వర్గ ఉద్యమాలకే తన జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ పరస సత్యనారాయణ ధన్య జీవి అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో బుధవారం జరిగిన పరస సత్యనారాయణ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు పార్టీ నేత గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షత వహించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి తాలూకాలో జన్మించిన పరస సత్యనారాయణ తెనాలి, దుగ్గిరాల, హైదరాబాదులలో చదువు పూర్తి చేసుకొని సింగరేణి బొగ్గు గనులలో కార్మికునిగా చేరారన్నారు. అక్కడ కార్మికుల స్థితిగతులను, కష్ట నష్టాలను తెలుసుకొని కార్మిక సంఘాలను నిర్మించి కార్మికోద్యమాలను నడిపారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన కార్మిక సంఘం నాయకునిగా గుర్తింపు పొందారన్నారు. ఎన్నో ఆటు పోట్ల అనంతరం ఆయన పూర్తి కాలం కార్యకర్తగా, కార్మిక సంఘం నాయకుడిగా పనిచేశారన్నారు. సత్యనారాయణ ఉత్తమ కమ్యూనిస్టుగా తన జీవితాన్ని కార్మికోద్యమాలకే అంకితం చేశారన్నారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏవీఎస్ గోపాలరావు, నాయకులు హనుమంత్ రెడ్డి, శివ కుమారి, జె.రాజకుమార్, పెద్ది రాజు, గుంటుపల్లి రజిని, బగ్గి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం ట్రస్ట్ ద్వారా ఇంటర్మీడియట్‌లో 10వ తరగతిలో 400 మార్కులు దాటిన విద్యార్థులకు పూర్తి ఉచిత విద్యను అందించనున్నట్లు ఆశ్రమ వంశ పారంపర్య ధర్మకర్త చింతాడ లలితాంబ మాతాజీ బుధవారం తెలిపారు. ట్రస్ట్ కళాశాల ద్వారా కాలేజ్ ఫీజు, పాఠ్య, నోట్ పుస్తకాలు, బస్, హాస్టల్ వసతి అందించనున్నట్లు ఆమె తెలిపారు. గత సంవత్సరం ట్రస్ట్ ద్వారా ఉచిత ప్రవేశం పొందిన విద్యార్థులు జూనియర్ ఇంటర్‌లో 452 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో 953, 952 మార్కులు సాధించారన్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రుపులలో 25 మంది బాలబాలికలకు పూర్తి ఉచిత విద్య అందించేందుకు నిర్ణయించామన్నారు. కుల, మత ప్రాధాన్యత లేకుండా ఎవరైనా ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గత 30 సంవత్సరాలుగా ఈ ఉచిత విద్యా పథకాన్ని ఆశ్రమం కొనసాగిస్తుందన్నారు. అవసరమైన వారు తమ దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, గుంటూరు రోడ్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా అనే చిరునామాకు పంపాలని ఆమె కోరారు. ఎంపికైన విద్యార్థులకు వేర్వేరుగా తరగతులు, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9440383782, 9491300312 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

రామకృష్ణ మాస్టార్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు



పిడుగురాళ్ల: విద్యా రంగంలో విశేష కృషి చేసిన పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వివేకానంద పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రామకృష్ణ మాస్టార్‌కు మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఐకాన్ అవార్డు అందజేశారు. పల్నాడు ప్రాంతానికి వన్నె తెచ్చే విధంగా విలువలతో కూడిన మంచి సమాజాన్ని అందించాలని నిరంతరం పరితపిస్తూ ఉత్తమ బోధన, క్రమ శిక్షణ, మన సంప్రదాయాలు, సంస్కృతి వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దటంతో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 21వ తేదీన మంజునాథ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రామకృష్ణ మాస్టార్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డును అందించారు. దీంతో పట్టణ ప్రజలు ఆయనను అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com